క్లుప్తంగా

కోదండరామస్వామి సేవలో టీటీడీ చైర్మన్



కోదండరామస్వామి ఆలయంలో టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి

పూతలపట్టు: మండలంలోని పేటమిట్ట గ్రామంలోని ప్రసిద్ధ శ్రీకోదండరామస్వామిని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి దంపతులు బుధవారం ఉదయం దర్శించుకున్నారు. గల్లా రామచంద్రనాయుడు ఆహ్వానం మేరకు ఆలయాన్ని ఆయన సందర్శించారు. వారికి గల్లా రామచంద్రనాయుడు సాదర స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న కరుణాకరరెడ్డికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. గల్లా అరుణకుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

తవణంపల్లె: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు సత్కారం, జ్ఞాపికలు, సర్టిఫికెట్ల పంపిణీ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్ పాల్గొంటారన్నారు.

మండల సమావేశం రేపు

బంగారుపాళెం: మండల సర్వసభ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివశంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ భవనంలో ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దకే సేవలు

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఇంటి వద్ద వైద్యసేవలు అందుతున్నట్లు వైద్యాధికారి అనూష అన్నారు. బుధవారం పేయనపల్లె గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మంచాన పడిన రోగులను ఇంటివద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం బీపీ, షుగర్, గర్భిణులకు వైద్యసేవలు అందించి, మందులు, మాత్రలను పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది రెజ్వాన, అన్నపూర్ణ, శశి,శివగామి, శిరిట పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో ఏసీ రూమ్

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల కోసం ఏసీ వెయిటింగ్ రూమ్ ఏర్పాటు చేయనున్నట్లు కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ బుధవారం తెలిపారు. ప్రస్తుతం మూడు సాధారణ వెయిటింగ్ రూమ్స్ ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఒక గదిని ఏసీ, వాష్ రూమ్, టాయిలెట్, టీవీ సదుపాయాలతో పెయిడ్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

ఆర్మీ జవాన్ సేవలు మరవలేనివి



బోర్డు ఆవిష్కరిస్తున్న ఆర్మీ కమాండెంట్లు, ప్రజాప్రతినిధులు

పూతలపట్టు: మండలంలోని చిన్నబండపల్లెకు చెందిన ఆర్మీ జవాన్ వినాయగన్ సేవలు మరవలేనివని సర్పంచ్ మహేశ్వరి అన్నారు. 2013 జూన్ 25న ఉత్తరాఖండ్ వరదల రెస్క్యూ ఆపరేషన్‌లో ప్రాణాలు కోల్పోయిన వినాయగన్ సేవను గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం చిన్నబండపల్లెలోని ఓ వీధికి వినాయగన్ పేరును పెట్టింది. బుధవారం చిన్నబండపల్లెలోని ఆ వీధికి వినాయగన్ పేరుతో ఏర్పాటు చేసిన బోర్డును ఆర్మీ ఐటీబీపీ కమాండెంట్ల ఆధ్వర్యంలో స్థాపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఆర్మీ ఐటీబీపీ కమాండెంట్లు, పంచాయతీ కార్యదర్శి రాజ, వినాయగన్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సులభరీతిలో బోధన సాగాలి

గుడిపాల: అర్థమయ్యే రీతిలో సులభ రీతిలో విద్యా బోధన సాగాలని ఎంఈఓలు రామ్ నాయక్, గణపతి అన్నారు. నరహరిపేట హైస్కూల్‌లో సాంఘికశాస్త్రం, ఆంగ్లవిద్యపై ఉపాధ్యాయులకు సీఆర్‌సీ సమావేశంలో శిక్షణ ఇచ్చారు. ఆన్‌లైన్ తరగతులను నిర్వహించాలని తెలిపారు. 10వ తరగతి పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు.

పేదల చెంతకే వైద్యసేవలు

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా పేదల చెంతకే ప్రభుత్వం మెరుగైన వైద్యసేవలు అందిస్తోందని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కోనగుంటలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 80 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అమ్మ పండుగకు వేళాయే..

- భక్తుల కొంగు బంగారం అంకాళ పరమేశ్వరి మాతా
- 250 ఏళ్ల కిత్రం ఆలయం నిర్మితం
- మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు
- శ్మశానకొల్ల ఉత్సవం వినూత్నం



శ్మశాన కొల్లలో అశేష భక్తజనం నడుమ విహరిస్తున్న అమ్మవారు (ఫైల్)

కోర్కెలు తీర్చే కల్పవల్లిగా..పరమేశ్వరుని ప్రతిరూపంగా.. సంతాన వర ప్రదాయినిగా నగరంలోని శ్రీఅంకాళపరమేశ్వరి ఆలయం విరాజిల్లుతోంది. 250 సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు ప్రత్యేకం. అమ్మ పండుగ అంటే ఇంటింటా సందడే. ఉత్సవాల్లో జరిగే శ్మశాన కొల్లకు భక్తులు పోటెత్తుతారు. భక్తి పారవశ్యంతో ఊగిపోయే శివసత్తుల సందడి.. కోర్కెలు తీర్చమంటూ చేతులు జోడించే భక్తుల కోలాహలంతో ఆధ్మాత్మిక శోభ సంతరించుకుంటుంది. మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయం సిద్ధమవుతోంది.



అంకాళ పరమేశ్వరి ఆలయం



అంకాళ పరమేశ్వరి అమ్మవారు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని గుర్రప్పనాయుడు వీధిలోని శ్రీఅంకాళపరమేశ్వరి అమ్మవారికి శతాబ్దాల చరిత్ర ఉంది. అమ్మవారు స్వయంభుగా వెలశారని ప్రసిద్ధి. కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. 250 సంవత్సరాలకు ముందు ఆలయ ప్రాంతంలో పెద్ద పుట్టగా అమ్మవారు వెలిశారు. ఆ పుట్టకు బెస్త కులస్తులు పూజలు చేసి భక్తిశద్ధలతో కొలిచేవారు. క్రమంగా కొన్నాళ్ల తర్వాత రాతి కట్టడాలతో ఆలయాన్ని నిర్మించారు. ఊరంతా కలిసి పెద్ద ఎత్తున పూజలు చేయడంతో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించేవారు. అంటు వ్యాధుల నుంచి బయటపడ్డారు. ప్రధానంగా సంతాన వర ప్రదాయినిగా కరుణించడంతో భక్తులకు అమ్మవారికి అపారమైన నమ్మకం ఏర్పడింది. ప్రతి శుక్రవారం, అమావాస్య, దసరా నవరాత్రుల్లో ఉత్స వాలు చేయడం ప్రారంభించారు. మహాశివరాత్రి ఉత్సవాలను రెండు రోజులు సంబరంగా నిర్వహిస్తారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు దర్శనమిస్తారు. మహాశిరాత్రి పూజలు, సోది అలంకారం ప్రత్యేకంగా జరగుతాయి. ఈ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. మహాశివరాత్రి మరుసటి రోజు నీవానది ఒడ్డున్న శ్మశానకొల్లను అట్టహాసంగా నిర్వహిస్తారు. అక్కడ దక్షుడి విగ్రహాన్ని తీర్చిదిద్ది అంకాళపరమేశ్వరి అమ్మవారిని సేవకు తీసుకొస్తారు. దక్ష సంహారం ఘట్టం ప్రదర్శిస్తారు. ఈ దక్షుడి ప్రతిమ మట్టి కోసం భక్తులు ఎగబడుతుంటారు. మహిళలు అమ్మవారిని మడిభిక్ష కోరుతారు. కొంత మంది సోది చెబుతూ..మరికొందరు పూనకంతోనే ఊగిపోతుంటారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు రాష్ట్ర ప్రజలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో జనం తరలివస్తుంటారు. ఈ ఉత్సవాన్ని 150 ఏళ్లకు పైగా నిర్వహిస్తున్నారు.

మహోత్సవాలకు ఏర్పాట్లు

మార్చి 7,8,9 తేదీల్లో ఆలయంలో మహాశివరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కేఎం కుమార్ తెలిపారు. ముందస్తుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయాన్ని ముస్తాబు చేయడంతో పాటు ఉత్సవ నిర్వహణ పనులపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టినట్లు తెలిపారు. అమ్మవారి అలంకరణ, శ్మశానకొల్ల నిర్వహణ, ఊరేగింపు, భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

అమ్మా.. జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం



ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జ్ సునీల్‌కుమార్

యాదమరి: ''అమ్మా.. ఫ్యాను గుర్తుకు ఓటేసి మన ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపిస్తే మళ్లీ జగనన్న సీఎం అవుతారు'' అని జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి అన్నారు. దీంతో ప్రజలు ''అన్నా... మేం ఫ్యాన్ గుర్తుకే ఓటేస్తాం. జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటాం..లేకపోతే ఇప్పుడు ఇస్తున్న పథకాలు రావు.. మాకు తెలుసు..'' అని చెప్పడంతో వైఎస్సార్‌సీపీ నాయకులంతా చప్పట్లు తట్టి వారిని అభినందించారు. యాదమరి మండలంలోని జంగాపల్లె పంచాయతీలోని గ్రామాల్లో బుధవారం జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, వైఎస్సార్ సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్‌ను జంగాపల్లె పంచాయతీ ప్రజలకు పరిచయం చేశారు. ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదట 70 కొత్తపల్లెలోని వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు.

సమస్యలను పరిష్కరిస్తాం

ప్రచారం సందర్భంగా వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త సునీల్‌కుమార్ మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యనూ వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సచివాలయ సిబ్బంది సక్రమంగా స్పందించడం లేదని ఈ సందర్భంగా కొందరు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన ఎంపీడీఓతో మాట్లాడి వారికి సూచనలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌బాబు, వైస్ ఎంపీపీ రవీంద్రబాబు, హరినారాయణ రెడ్డి, నాయకులు నాగేశ్వర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, సురేంద్ర రెడ్డి, గోందివాళ్లపూరు బాబు, రవి, కార్తిక్ రెడ్డి, సురేష్, హేమ, కరుణాకర్, బాబా, భాస్కర్, ప్రకాష్, గజా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శాఖలో శరవేగంగా ఆడిట్

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని జిల్లావైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆడిట్ ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. ఈ ఆడిట్ వారం రోజుల పాటు జరుగుతుండగా ఈనెలాఖరికి పూర్తి కానుంది. ముగ్గురు ఆడిట్ అధికారులు కలిసి 2018 నుంచి 2023వరకు శాఖ ద్వారా జరిగిన లావాదేవీలు, విభాగాల వారీగా చేపట్టిన పోస్టుల భర్తీ, ఇతరాత్ర వాటిపై ఆడిట్ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

మాతృభాషపై మమకారం పెంచుకోండి

తవణంపల్లె: మాతృభాషపై విద్యార్థులు మమకారం పెంచుకోవాలని అరగొండ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అరగొండ బాలికల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాటలు, పద్యాలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి విశ్రాంత ఉపాధ్యాయిని భువనేశ్వరి ఆర్థిక సహాయంతో బహుమతులు అందజేశారు. విద్యార్థినుల సంప్రదాయ వేషాధారణ అందరినీ ఆకట్టుకుంది.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఐరాల: కాణిపాకం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నాబార్డ్ సౌజన్యంతో ఖాతాదారులకు వైస్ గేటులో బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్స్' ఆర్గనైజేషన్ కళాజాత బృందం సభ్యులు రాఘవేంద్ర, మహేష్, అశోక్ తదితరులు మ్యాజిక్ షో, పాటలతో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ రాజీవ్ పాల్గొన్నారు.

మహిళా రైతు సంఘాలకు రుణాలు

గుడిపాల: మహిళా రైతుల సంఘాలకు ప్రభుత్వం రుణాలను మంజూరు చేస్తుందని ఇందిరాక్రాంతి ఏపీఎం సుధారాణి అన్నారు. బుధవారం వెలుగు కార్యాలయంలో సంఘమిత్రలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 60 సంవత్సరాలు లోపల ఉన్న మహిళా రైతులను 12 మందిని సంఘంగా ఏర్పాటు చేయాలన్నారు. ఈసంఘాలకు స్వయం సహాయక గ్రూపులకు ఇచ్చినట్లే బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేస్తారని తెలిపారు. ప్రభుత్వం నుంచి రివాల్వింగ్‌ఫండ్ రావడంతో పాటు పంటకు అవసరమైన రుణాన్ని మంజూరు చేస్తుందని, పంట ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పిస్తుందన్నారు. వెలుగుసీసీలు మల్లీశ్వరి, లోకనాథరెడ్డి, హేమచంద్రారెడ్డి పాల్గొన్నారు.

శరవేగంగా ఈ-పంట నమోదు

సాగు ప్రయోజనాలను రైతులకు సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం ఈ-క్రాప్ విధానాన్ని అమలు చేస్తోంది. కరువు, అధిక వర్షాలతో పంట నష్టపోయినప్పుడు పరిహారం అందిస్తోంది. ఇన్‌పుట్ సబ్సిడీ, పెట్టుబడి సాయం, పంటల బీమా, పంట నష్టపరిహారం , గిట్టుబాటు ధర, ఎరువులు, పురుగుల మందులు తదితరాలు రాయితీపై అందుతాయి. ఈ ప్రయోజనాలు అందాలంటే ఈ-క్రాప్ నమోదు చేయించుకోవడం తప్పనిసరి. గుడిపాల మండలంలో శరవేగంగా ఈ-పంట నమోదు జరుగుతోంది.



గుడిపాలలో ఈ-క్రాప్ పంట నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

గుడిపాల: మండలంలో ఈ-పంటల నమోదు శరవేగంగా నమోదు చేస్తున్నారు. ఇప్పటికే 95 శాతానికి పైగా పూర్తి చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి పెద్దపీట వేశారు. ఈ క్రాప్ నమోదు ప్రయోజనాలపై అవగాహన కల్పించి వ్యవసాయాధికారులు రైతులతో శరవేగంగా పూర్తి చేశారు. మండలంలో 32 రెవెన్యూ గ్రామాల్లో ఈ ఏడాది రబీ సీజన్‌లో 1,640 మంది రైతులు సుమారు 1860 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. రైతులు ప్రధానంగా వరి, వేరుశనగ, మిరప, అరటితో పాటు ఇతర పంటలతో పాటు కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. మండలంలో వ్యవసాయ శాఖ సిబ్బంది 95 శాతానికి పైగా ఈ-క్రాప్ నమోదులతో పాటు, ఈకేవైసీ పూర్తి చేశారు. ఈనెలాఖరు లోపు అన్ని గ్రామాల్లో ఈ-క్రాప్‌తో పాటు ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ-క్రాప్ నమోదు ఇలా: వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ-కర్షక్ యాప్‌లో రైతుల వివరాలు, పంటల సాగు వివరాలను నమోదు చేస్తారు. మొదట రైతుభరోసా కేంద్రాల్లో రైతుల వివరాల నమోదు, క్షేత్రస్థాయిలో పంటల నమోదు, చివరగా ప్రతి రైతుతో ఈ-కేవైసీ నమోదు చేయిస్తారు. ఇలా ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందుతాయి.

రైతులు త్వర పడాలి



రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, పొలాల వద్దకే వెళ్లి రబీ పంటల వివరాలు నమోదు చేస్తున్నాం. ఈ-క్రాప్ పూర్తయిన తర్వాత ప్రతి రైతు ఈనెల 23వ తేదీలోపు ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలి. దాంతోపాటు ఆధార్ అనుసంధానం చేయించుకోవాలి.

–మాధవి, వ్యవసాయాధికారి

రైతులకు వరం



ఈ-క్రాప్ నమోదు రైతులకు వరం లాంటిది. గతంలో పంటలు వేసుకుని నష్టపోయినట్లయితే ప్రభుత్వం నుంచి డబ్బులు వచ్చేవి కావు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఈ-క్రాప్ నమోదుతో పంట నష్టం అయినట్లయితే ఇన్‌పుట్ సబ్సిడీ కింద నగదును అందజేస్తున్నారు. పంటలకు గిట్టుబాటు ధర కూడా కల్పిస్తున్నారు.

–రెడ్డెప్ప, రైతు, గుడిపాల

అన్నివిధాలా మేలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం ఎంతో మేలు చేస్తున్నారు. గతంలో ఎరువులు, పురుగు మందులు కావాలంటే పట్టణానికి వెళ్లాల్సింది. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల ద్వారానే అందిస్తున్నారు. దీంతో పాటు పంటలకు ఉచితంగా ప్రభుత్వమే ఇన్సూరెన్స్ చేయిస్తుంది. పంట దెబ్బ తిన్నంటే ఈక్రాప్ నమోదుతో పరిహారం కూడా అందిస్తున్నారు.

–గోవిందరెడ్డి, రైతు, వసంతాపురం

నీటి సరఫరా.. పారిశుద్ధ్యంపై దృష్టి





మాట్లాడుతున్న మేయర్ అముద, కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

- ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ
- మేయర్ అముద
- పలు పనులకు కౌన్సిల్ ఆమోదం

చిత్తూరు అర్బన్: రానున్న వేసవి దృష్ట్యా నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు చిత్తూరు మున్సిపల్ పాలకవర్గం సూచించింది. బుధవారం చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బడ్జెట్, సాధారణ సమావేశాలు మేయర్ అముద అధ్యక్షతన జరిగాయి. సహాయ కమిషనర్ గోవర్ధన్, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసం సభ్యులంతా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. రానున్న వేసవిను దృష్టిలో ఉంచుకుని నగరంలో నీటి ఎద్దడి తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని, వీధిలైట్లు, పరిసరాల శుభ్రత, దోమల నియంత్రణ వంటి చర్యల కోసం యాక్షన్ ప్లాన్ రూపొందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 29న ఉద్యోగ విరమణ చేయనున్న సహాయ కమిషనర్ గోవర్ధన్‌కు పాలకవర్గం అభినందలు తెలిపింది. సమావేశంలో డిప్యూటీ మేయర్, రాజేష్ కుమార్ రెడ్డి, మునిసిపల్ ఇంజనీరు గోమతి, ఏసీపీ రామకృష్ణుడు, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, రెవెన్యూ అధికారి గోపాలకృష్ణవర్మ, సీఎంఎం గోపి ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం అజెండాలోని అంశాలపై తీర్మానించారు. తీర్మానాలివీ..

- గిరింపేట మున్సిపల్ పార్కు స్థలంలో స్వాతంత్ర్య సమరయోధులు మరుదూరు బ్రదర్స్ విగ్రహాల ప్రతిష్ఠ, పార్కుకు వీరి పేరును పెట్టాలని ఆమోదం.
- పీవీకేఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి అంబేడ్కర్ భవన్ వరకు ఉన్న రోడ్డు మార్గానికి కేబీఆర్ మ్యాంగో భవన్ రోడ్డుగా, కట్టమంచి నుంచి సాంబయ్య కండిగ వరకు ఉన్న రోడ్డును డాక్టర్ సీఆర్ రెడ్డి బైపాస్ రోడ్డుగా, గిరింపేట చెరువు వీధిని పొన్నుస్వామి నాయకర్ వీధిగా నామకరణం చేయాలని తీర్మానం.
- కార్పొరేషన్ కూరగాయల మార్కెట్లు, జంతువధశాల, ఎన్టీఆర్ బస్టాండ్, కాసు బ్రహ్మానంద రెడ్డి బస్టాండ్లలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిబంధనల ప్రకారం రుసుం వసూలు చేసుకునేందుకు బహిరంగ వేలం నిర్వహణ.
- అక్రిడిటేటెడ్ జర్నలిస్టుల ఇంటి స్థలాలకు సంబంధించి ఇరువారం గ్రామ రెవెన్యూలో గుర్తించిన భూమి స్వభావం మార్చేందుకు ఆమోదం.
- ఎంఎస్‌ఆర్ కూడలిలో కమలహాసన్ పేరిట లీజుకు తీసుకున్న వాణిజ్య సముదాయాలను టెండర్లు పిలిచేందుకు, నగర పరిధిలోని గ్రావెల్ తరలింపునకు ఓ కంపెనీకు అనుమతులు ఇచ్చే అంశం వాయిదా. దీనిపై డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ తన అభిప్రాయాన్ని తెలియచేస్తూ న్యాయ అభిప్రాయం తీసుకోవాలని సూచించగా.. కార్పొరేటర్ అలీ దీన్ని వ్యతిరేకించారు. టెండర్లు పిలిచి కొత్తవాళ్లకు షాపులు అప్పగించాలని కోరగా, మేయర్ కలుగచేసుకుని ఆ అంశాన్ని వాయిదా వేశారు.

ఘనంగా మాతృ భాషా దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ మనోహర్

చిత్తూరు కలెక్టరేట్: మాతృభాషతోనే సాంస్కృతిక మూలాలను కాపాడుకోవచ్చని ప్రభుత్వ ఎస్పీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ అన్నారు. బుధవారం కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాతృభాషపై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలన్నారు. మాతృభాషలో ప్రావీణ్యత సాధిస్తే ఇతర భాషల్లో కూడా రాణిస్తారని తెలిపారు. తెలుగు శాఖ ప్రొఫెసర్ ఉషారాణి మాట్లాడుతూ ఎన్ని భాషలు నేర్చినప్పటికీ అమ్మభాష కమ్మదనం గొప్పదన్నారు. హిందీ ప్రొఫెసర్ షమ్స్ అక్తర్ పాల్గొన్నారు.

గుడిపాల మండలంలో..

గుడిపాల: మండల కేంద్రంలోని సీఎస్ఆర్ కళాశాల, నరహరిపేట జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులకు పద్యపఠన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. మాతృభాషా పరిరక్షణ సమితి మండల అధ్యక్షుడు సి.అర్జున్, నరహరిపేట హెచ్ఎం ప్రసాద్ మాట్లాడుతూ మాతృభాష పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. పఠన పోటీలో ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్న విద్యార్థులు పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారు ఆలపించిన వేమన, సుమతి శతక పద్యాలు అలరించాయి. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. తెలుగు అధ్యాపకులు అర్జున్, భాస్కర్‌నాయుడు ఆలపించిన పద్యాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ రామచంద్ర పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి మీరే వారధులు





యాదమరి: సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, వలంటీర్లు, అవార్డులు అందుకున్న వలంటీర్లతో సునీల్‌కుమార్

యాదమరి: వైఎస్సార్ సీపీకి వలంటీర్లే వారధులని పార్టీ పూతలపట్టు నియోజక వర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం మధ్యాహ్నం ఎంపీడీఓ కార్యాలయం వద్ద వలంటీర్లకు వందన కార్యక్రమానికి ఆయన, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మండలంలోని 218 మంది వలంటీర్లను సత్కరించి, కానుకలు అందజేశారు. సేవావజ్ర ఒకరికి, సేవారత్న ఇద్దరికి, సేవామిత్ర 212 మందికి అందజేశారు. సునీల్‌కుమార్ మాట్లాడుతు జగనన్న ప్రభుత్వానికి వలంటీర్లు వారధులుగా పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌బాబు, ఎంపీడీఓ సింగన్న, వైస్ ఎంపీపీలు హరనారాయణ రెడ్డి, రవీంద్రబాబు, మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

మీరే జగనన్న సైనికులు

ఐరాల: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వలంటీర్లు వారధులుగా నిలిచారని, జగనన్న సైనికులు మీరేనని పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం ఎంపీడీఓ కుసుమకుమారి అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. మండలంలో సేవారత్న అవార్డుకు అనూష(ఐరాల), లావణ్య (ఐలవారిపల్లె), శ్రీవిద్య (ముదిగోళం), మృదుల (గుండ్లపల్లె), భార్గవి(పొలకల) ఎంపికయ్యారు. అలాగే మరో 256 మంది వలంటీర్లు సేవామిత్ర అవార్డులకు ఎంపికయ్యారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సునీల్‌కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు అవార్డులు వచ్చిన వలంటీర్లకు నగదు బహుమతి, ధ్రువీకరణ పత్రం, జ్ఞాపిక అందజేసి, సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల సిఫారసు మేరకు ఆ పార్టీ వారికి మాత్రమే అందేవని, పేదలకు మొండిచేయి చూపారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా పథకాలు అర్హతే ప్రామాణికంగా అందజేస్తున్నారన్నారు. గ్రామాల్లో అవ్వాతాతల ఆనందం ఒక వలంటీర్లకే సొంతమని మహిళ, శిశు సంక్షేమ శాఖ రాయలసీమ రీజినల్ చైర్‌పర్సన్ శైలజ అన్నారు. మరోసారి జగనన్నను సీఎం చేసుకుంటేనే సుపారిపాలన మళ్లీ ప్రజలకు అందుతుందని చెప్పారు.

పాలశీతలీకరణ కేంద్రాలతో లబ్ధి

పూతలపట్టు: పాలశీతలీకరణ కేంద్రాలతో పాడి రైతులకు లబ్ధి చేకూరుతుందని జేసీఎస్ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. పోలవరంలో ఏర్పాటు చేసిన బల్క్‌మిల్క్ సెంటర్‌ను ఎంపీటీసీ సభ్యురాలు కృష్ణమ్మ, సర్పంచ్ నిర్మల, స్థలదాత అరుణ బుధవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు ఇంట పాడిని అభివృద్ధి చేయాలనే తలంపుతో ప్రభుత్వం పాలసేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. అమూల్ సంస్థ ఆధ్వర్యంలో సేకరణ చేపట్టడంతో గిట్టుబాటు ధర లభిస్తుందని తెలిపారు. ఎంపీడీఓ ప్రసన్నకుమారి, స్థల దాత అరుణ, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, నాయకులు నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీపీ గీతారెడ్డి

తవణంపల్లె: ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడానికి అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేయాలని తవణంపల్లె ఎంపీపీ గీతారెడ్డి తెలిపారు. బుధవారం తవణంపల్లె మండల పరిషత్ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ గీతారెడ్డి మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు భారతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పెట్టే భోజనంలో తాజా ఆకుకూరలు వాడాలని సూచించారు. తవణంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండడంతో అధికారులు, సిబ్బంది సహకరించాలని కోరారు. ఆర్‌అండ్‌బీ అధికారు లు సమావేశానికి హాజరుకాకపోవడంతో ఏమిటని సభ్యులు మండిపడ్డారు. పేద పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ హేమలత తెలిపారు. ఎన్నికలకు ముందే పక్కాగృహాల నిర్మాణం పనులు పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఏఈ శ్రీధర్ కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు శోభారెడ్డి, పట్నం ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.